సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం : 24 : డిసెంబర్ : 2024



రైతు సంఘాల నిరసన

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని రైతు సంఘాల ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. చట్టం ప్రతులను దగ్ధం చేశారు. - 8లో



రూ.11 కోట్లు దుర్వినియోగం

పశుసంవర్ధక శాఖలో 2017లో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.11 కోట్లు దుర్వినియోగం జరిగాయని దళిత సంఘా నాయకులు జేసీకి ఫిర్యాదు చేశారు. - 8లో



శ్రీకాకుళంలోని ఓ షాపింగ్ మాల్ వద్ద శాంతాక్లాజ్ సందడి

న్యూస్‌రీల్

ఎల్‌ఎల్‌బీలో 13 మందికి స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మూడేళ్ల ఎల్‌ఎల్‌బీలో 13 మిగులు సీట్లకు ఈ నెల 20న స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానించారు. 52 మంది దరఖాస్తు చేసుకోగా వీసీ కె.ఆర్.రజిని సోమవారం సీట్లు ఎలాట్ చేశారు. 13 సీట్లలో ఈడబ్ల్యూఎస్ సీట్లు రెండు ఉన్నాయి. లాసెట్ - 2024 ర్యాంకు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పించారు.

బధిరుల జట్టు భళా!



బధిరుల క్రికెట్ జట్టును అభినందిస్తున్న జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: విశాఖ జోన్ వన్ పరిధిలో జరిగిన టీ20 క్రికెట్ పోటీల్లో శ్రీకాకుళం బధిరుల జట్టు విజేతగా నిలవడంతో క్రీడాకారులను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సోమవారం అభినందించారు. జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఐదు జిల్లాలతో పోటీ పడి ట్రోఫీని గెలుచుకోవడం జిల్లాకు గర్వకారణమని కొనియాడారు. కార్యక్రమంలో బధిర సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావు, కార్యదర్శి ఏ.భాస్కరరావు పాల్గొన్నారు.

'స్వీప్'కు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఐజీ శేషగిరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్య (స్వీప్) కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సంక్షిప్త సవరణ ఓటరు జాబితా జిల్లా పరిశీలకుడు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ ఎం.వి.శేషగిరిబాబు ఆదేశించారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ-2025పై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన సోమవారం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ ఓటర్లే లక్ష్యంగా అన్ని జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహించాలన్నారు. అనంతరం సవరణ ప్రక్రియ సందర్భంగా వచ్చిన క్లెయిములు, ఆమోదించినవి, తిరస్కరణకు గురైన వాటి పట్ల ఆరా తీశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే డ్రాఫ్ట్ జాబితా సిద్ధమైందని, జనవరి 5న ఓటర్ల తుది జాబితాను ప్రచురించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ విడతలో 19,246 మంది యువత ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇంకా 39 వేలమంది అర్హులుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ అప్పారావు, నాయకులు రౌతు శంకరరావు, పీఎంజే బాబు, ముద్దాడ రామకృష్ణ, సురేష్ బాబు సింగ్, చల్లా వెంకటేశ్వరరావు, ఎం.గోవిందరావు, కేవీఎల్ఎస్.ఈశ్వరి, బైరి అప్పారావు, గరికివాడు తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో చేపట్టిన భవన నిర్మాణాలు పూర్తి చేస్తాం

- మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గత ప్రభుత్వంలో చేపట్టిన భవన నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధి పనులు, పల్లె పండుగ పనుల అమలుపై మంత్రి.. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణతో కలిసి సమీక్షించారు. గతంలో చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రాలు, రైతు భరోసా, హెల్త్ క్లినిక్ సెంటర్లు, సచివాలయ భవనాల నిర్మాణం పూర్తి చేసేందుకు ఎంతమేర నిధులు అవసరమో తెలియజేయాలని మంత్రి ఆదేశించారు. ఉపాధి హామీ పథకం బిల్లులు సకాలంలో చెల్లిస్తుండటంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. రానున్న మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా మూడోశనివారం ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో పరిశుభ్రత పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ బి.సుధాకరరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రాణి మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాషా, పంచాయతీరాజ్ ఈఈలు రామకృష్ణ, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ హైటీ
ఇంత రాజకీయం ఏమిటీ!

ఈ చిత్రాలు చూడండి. జిల్లా కేంద్రంలో భారీగా ఎత్తున జరగాల్సిన క్రిస్మస్ హైటీ కార్యక్రమంలో క్రైస్తవుల హాజరు ఎంత పలచగా ఉందో. ఇందులో చాలా వరకు సంబంధిత సిబ్బంది కూడా ఉన్నారు. వీరిని తీసేస్తే ముందు వరుస కుర్చీలు కూడా నిండని పరిస్థితి. క్రైస్తవులతో ఘనంగా జరుపుకోవాల్సిన హైటీ కార్యక్రమం వేలవంగా సాగడం చర్చనీయాంశమైంది.



- అధికారుల అత్యుత్సాహం
- నేతల మెప్పుకోసం ఒక పక్షానికే ఆహ్వానం
- టీడీపీ సానుభూతిపరులే హాజరు
- జిల్లా, నగర క్రైస్తవ సంఘం ప్రముఖులు సైతం దూరం
- మంత్రి అచ్చెన్న, ఎమ్మెల్యేలు వచ్చేసరికి వేదిక ప్రాంగణంలో పెద్దగా కన్పించని క్రైస్తవులు
- అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే గొండు శంకర్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

క్రిస్మస్ హైటీ రాజకీయ రంగు పులుముకుంది. ఈ కార్యక్రమానికి టీడీపీ సానుభూతిపరులకు మాత్రమే ఆహ్వానం అందింది. దీంతో సోమవారం జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం పక్కన బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో జరిగిన క్రిస్మస్ హైటీ కార్యక్రమం వెలవెలబోయింది. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన కార్యక్రమంలో వివక్ష చూపడంతో క్రైస్తవులు అత్యల్పంగా హాజరయ్యారు. ముఖ్యంగా శ్రీకాకుళం నగరంలోని క్రైస్తవులు పెద్దగా కన్పించలేదు. కొత్తూరు, వజ్రపుకొత్తూరు, నందిగాం ప్రాంతాల పరిధిలోని ఎంపిక చేసిన వ్యక్తులు మాత్రమే పాల్గొన్నారు. దీంతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి వచ్చేసరికి క్రైస్తవులు తక్కువగా కనిపించారు. ఈ సమయంలో నేతలు సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. దీంతో అప్పటికప్పుడు సమీప ప్రాంతానికి చెందిన క్రైస్తవులను యుద్ధ ప్రాతిపదికన తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు.

గతానికి భిన్నంగా..

గతంలో ఎప్పుడూ క్రిస్మస్ హైటీ కార్యక్రమం ఇలా జరగలేదు. క్రైస్తవులతో ప్రాంగణమంతా నిండిపోయేది. కొందరు బయట కూడా ఉండాల్సి వచ్చేది. జిల్లా యంత్రాంగం అధికారికంగా నిర్వహించే హైటీ వేడుకలు ఘనంగా జరుగుతాయి. ఏటా ఒకసారి జరిగే వేడుకలను అధికారులు కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుని జరిపేవారు. ప్రజాప్రతినిధులు కూడా అదే స్థాయిలో పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పేవారు. ఇదే సమయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులను క్రైస్తవులు(దైవజనులు) సత్కరించేవారు. సాధారణంగా రాజకీయాలకు అతీతంగా ప్రముఖ దైవజనులతో ముందుగా సమావేశం నిర్వహించి, ఏ రోజున హైటీ కార్యక్రమం నిర్వహించాలో నిర్ణయం తీసుకుని, ఆ రోజున మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు హాజరయ్యేలా చూసుకుంటారు. కానీ ఈసారి దానికి భిన్నంగా జరిగింది. ఒక పక్షానికే ఆహ్వానాలు అందడంతో చాలా మంది కార్యక్రమానికి దూరమయ్యారు.

అత్యుత్సాహంతో అసహనం

జిల్లాలోనూ, నగరంలోని క్రైస్తవ ప్రముఖులతో ముందస్తు సమావేశం నిర్వహించిన దాఖలాల్లేవు. ముఖ్యంగా శ్రీకాకుళంలో పేరుమోసిన దైవజనులు ఉన్నారు. వీరందరికి ఆహ్వానాలు పలికి విజయవంతం చేయాల్సిన అధికారులు.. మంత్రులు, ఎమ్మెల్యేల మెప్పు కోసమే ఒక పక్షానికే ఆహ్వానాలు పలికారు. చివరికి క్రైస్తవులకు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా నాయకులకు కూడా సమాచారం ఇవ్వలేదు. దీంతో హైటీ కార్యక్రమానికి అత్యధిక క్రైస్తవులు దూరంగా ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కరెంట్ చార్జీలపై.. 27న వైఎస్సార్ సీపీ పోరుబాట

- అన్ని నియోజకవర్గాల్లో నిరసనలు చేపట్టాలి
- పార్టీ శ్రేణులకు జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్, పార్టీ నాయకులు

శ్రీకాకుళం రూరల్/నరసన్నపేట: పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరుతూ ఈ నెల 27న అన్ని నియోజకవర్గాల్లోనూ సబ్‌స్టేషన్లు, విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టి అధికారులకు వినతిపత్రాలు అందివ్వాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని పెదపాడులో పార్టీ కార్యాలయం వద్ద 'కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలకే విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. పోరుబాట కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం సూర్యమహల్ జంక్షన్ వద్ద ప్రారంభమయ్యే నిరసన ప్రదర్శనకు ప్రజలు, వ్యాపారులు, విద్యార్థులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు అన్నదాతలు అతాలకుతలం అయ్యారని చెప్పారు. ఇంతవరకూ ఎంత నష్టం వాటిల్లిందో వ్యవసాయ అధికారుల వద్ద గణాంకాలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుకు ఏ కష్టం వచ్చినా క్షణాల్లో సాయం అందేదని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులు కష్టాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, తూర్పుకాపు కుల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ స్టేట్ సెక్రటరీ కె.వి.సత్యనారాయణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణ, పార్టీ నాయకులు మూకళ్ల తాత బాబు, చిట్టి జనార్దనరావు, గేదెల పురుషోత్తం, రావాడ జోగినాయుడు, రౌతు శంకరరావు, కామేశ్వరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వర్సిటీకి పండుగ సెలవులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి ఈ నెల 24 నుంచి జనవరి 17 వరకు క్రిస్మస్, సంక్రాంతి పండుగ సెలవులు ప్రకటించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ పి.సుజాత సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జనవరి 18 నుంచి తరగతులు పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

గుండె గు'బిల్లు'



టెక్కలి: టెక్కలి పాత జాతీయ రహదారిలో ఓ అద్దె దుకాణంలో నిర్వహిస్తున్న ఆటోమొబైల్ రిపేర్ వర్క్ షాపునకు రూ.25,666 కరెంట్ బిల్లు రావడంతో దుకాణదారుడు లింగరాజు ఆందోళన చెందుతున్నాడు. మూడు నెలల క్రితం మీటరు సక్రమంగా పనిచేయడం లేదని విద్యుత్ సిబ్బంది కొత్త మీటరును ఏర్పాటు చేశారని, ఇప్పుడింత బిల్లు వేయడం తగదని వాపోతున్నాడు. అధికారులు స్పందించి బిల్లు భారాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.



కారు.. ______ నడిపిందెవరు?

- కొరసవాడలో శనివారం ఆటోను ఢీకొట్టిన పాతపట్నం ఎమ్మెల్యే తనయుడి కారు
- ఆ ఘటనలో ఐదుగురికి తీవ్రగాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- ఎమ్మెల్యే గోవిందరావు తనయుడే కారు నడిపారనే అనుమానాలు
- కేసును పక్కదారి పట్టించేందుకు ప్రయత్నాలు?

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

పాతపట్నం మండలం కొరసవాడ వద్ద ఈ నెల 21న ఆటోను ఢీకొట్టిన కారును డ్రైవింగ్ చేస్తున్నది ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కుమారుడా? ఆయన్ను తప్పించి మరొకర్ని డ్రైవర్‌గా చూపించేందుకు ప్రయత్నిస్తున్నారా? ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నాయా? ఉంటే సీసీ కెమెరాల ఫుటేజీలో ఏముంది? ఇప్పుడీ అనుమానాలు పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. పాతపట్నం నియోజకవర్గంలోనే కాదు జిల్లా కేంద్రంలో కూడా చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కుమారుడు సాయి గణేష్ ఆ సమయంలో కారు నడుపుతున్నాడని స్థానికులు తెలియజేశారని బాధిత కుటుంబీకులు చెబుతున్నారు. ఎమ్మెల్యే తనయుడు సాయి గణేష్ కారు ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఇందులో చెప్పల బోగయ్య అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. ఈయన కోడలు చెప్పల సంతోషికి కూడా తలకు తీవ్రగాయాలయ్యాయి. ఇదే ప్రమాదంలో అన్నదమ్ములైన సవలాపరపు నరేష్, గణేష్, ఆటో డ్రైవర్ గాయపడ్డారు. వీరిలో బోగయ్య ఆరోగ్య పరిస్థితి విషమించడంతో రిమ్స్ నుంచి మెడికవర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికీ బోగయ్య అపస్మారక స్థితిలోనే ఉన్నారు. పరిస్థితి విషమంగా ఉందని, ఇప్పుడే ఏమీ చెప్పలేమని వైద్యులు అంటున్నారు. మరోవైపు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన కోడలు సంతోషిని కూడా మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించి, చికిత్స అందించాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు. సంతోషి భర్త కోయంబత్తూరులో మేస్త్రి పనిచేస్తున్నారు. వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. దీనిని దృష్టిలో ఉంచుకుని కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చెప్పల బోగయ్య

గతంలోనూ..

ఎమ్మెల్యే తనయుడు కారుతో గతంలో రాగోలు వద్ద ఒకరిని ఢీకొట్టారన్న ప్రచారం కూడా ఉంది.

క్రిస్మస్ కలర్స్

జిల్లా అంతటా క్రిస్మస్ సందడి నెలకొంది. చర్చిలు విద్యుద్దీపాల వెలుగుల్లో మెరిసిపోతున్నాయి. క్రీస్తు సందేశాలు, ప్రార్థనలు, భక్తిగీతాలు, నృత్యాలతో కళకళలాడుతున్నాయి. వాడవాడలా సెమీక్రిస్మస్, కేరల్స్ వేడుకలు సందడిగా జరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలో వ్యాపార సముదాయాల వద్ద చిన్నారులను ఆకర్షించేలా శాంతాక్లాజ్ బొమ్మలు ఏర్పాటు చేశారు. కొందరు క్రిస్మస్ తాతయ్యల వేషధారణలతో ఆకట్టుకుంటున్నారు. అన్ని కళలకు క్రిస్మస్ పండుగ వేదికయింది. -శ్రీకాకుళం కల్చరల్

చరిత్రకు సాక్ష్యాలు..



జిల్లా కేంద్రంలోని టౌన్‌హాలు రోడ్డులో ఉన్న సెయింట్ థామస్ చర్చి చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. 150 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ చర్చిలో ఇప్పటికీ పురాతన వస్తువులు కనిపిస్తాయి. చర్చికి గుండెకాయ వంటి నిర్మాణం మందసం. ఇందులోనే క్రీస్తు ఉంటారని ఆరాధకుల నమ్మకం. ఈ చర్చిలో ఇప్పటి వరకు మూడు సార్లు 'మందసం' ఏర్పాటు చేసినట్లు ఫాదర్ బోనెల రాజు తెలిపారు. 1997లో నిర్మాణమైన సహాయ మాత చర్చిలో కూడా అప్పటి వస్తువులు భద్రపరిచినట్లు ఫాదర్ దూసి దేవరాజ్ చెప్పారు.

చర్చిలో మొదటి మందసం



ఇందులోనే క్రీస్తు ఉంటారని భక్తుల నమ్మకం

కన్‌ఫెషన్ బాక్స్



ఈ పెట్టె వద్ద తాము చేసిన పాపాలను ఫాదర్‌తో విన్నవించుకొని పరిహారం పొందుతారు.



పూజా పఠనాల గ్రంథం

ప్రధాన పీఠాధిపతి గానీ, విచారణ కర్త గానీ ఇక్కడి నుంచి బైబిల్ వాక్యాలు చదువుతారు

కదరా

క్రీస్తు ఆధ్వర్యంలో ఈ కదరాలోనే భోజనాలు చేసినట్లు భావిస్తారు.



శుద్ధజలం ధూప పరికరం

క్రిస్మస్ నాడు పీఠాధిపతి గానీ, విచారణ కర్త గానీ ప్రత్యేక దుస్తులు ధరించి శుద్ధజలాన్ని స్ప్రింక్లర్‌లో పోసి విశ్వాసులపై చల్లుతూ, ధూపం పాత్రలతో పీఠం వద్దకు వస్తారు.





మన్‌స్ట్రన్స్

ఇందులోనే క్రీస్తు ఉన్నట్లు భావిస్తారు. క్రిస్మస్ రోజున పీఠంపై ఉంచుతారు

లోక రక్షకుడి రాకను స్వాగతిస్తూ..



శ్రీకాకుళం తెలుగు బాప్టిస్టు చర్చిలో మహిళా క్రిస్మస్ వేడుకలు

చిన్నారుల సందడి

టెక్కలి: టెక్కలి-తెంబూరు రోడ్డులోని లివింగ్ స్టోన్ చర్చిలో సోమవారం పాస్టర్ కె.అబ్రహం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏసు జనన వృత్తాంతం వివరిస్తూ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



అతివల కోలాటం



కాశీబుగ్గ : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు పల్లివీధి చర్చిలో సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక మహిళలు బాల ఏసుపాటకు కోలాటం చేస్తూ ఆకట్టుకున్నారు.

క్లుప్తంగా

అధికార లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు


లక్ష్మణరావు(ఫైల్)

పొందూరు: మండలంలోని గోకర్నపల్లి పంచాయతీ రంగనాథపేటకు చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ దువ్వరపు లక్ష్మణరావు(44) విధి నిర్వహణలో మణిపూర్‌లో శుక్రవారం గుండెపోటుతో మరణించారు. సోమవారం స్వగ్రామానికి భౌతికకాయం రావడంతో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు.

పూరిల్లు దగ్ధం


నారువలో కాలిపోయిన పూరిల్లు

రణస్థలం: మండలంలోని నారువ గ్రామంలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న నీలాపు నర్సయ్యకు చెందిన పూరిల్లు అగ్నికి ఆహుతైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అగ్ని ప్రమాదం సంభవించి నర్సయ్య ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఎలక్ట్రికల్ వస్తువులు, మూడు తులాల బంగారం, యాభై వేల నగదు, ఆధార్ కార్డులు, దుస్తులు బూడిదయ్యాయి. సుమారు మూడు లక్షలు అస్తినష్టం వాటిల్లిందని బాధితులు చెబుతున్నారు. గ్రామ రెవెన్యూ అధికారి జగదీష్ కాలిపోయిన ఇంటిని పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేశారు.

గుంతల్లో తారు వేశారు


ఈదుపురం-తిప్పనపుట్టుగ జంక్షన్‌లో తారు వేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో తులసిగాం నుంచి కేశుపురం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డులో రూ.15 లక్షలతో ఇటీవల తారు, చిప్స్‌తో గోతులు పూడ్చారు. అనంతరం వర్షం కురవడంతో మూడు రోజుల్లోనే తారు తేలిపోయింది. ఈ విషయమై సోమవారం సాక్షి దిన పత్రికలో 'మార్గం..దుర్మార్గం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఆర్‌అండ్‌బీ ఏఈఈ డిక్కల విక్రమ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం హుటాహుటిన గుంతల్లో మరలా తారు వేశారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక(మీకోసం)లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి 77 అర్జీలు స్వీకరించారు. వారితో పాటు ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, ఉప కలెక్టర్లు లక్ష్మణమూర్తి, పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో ఎల్ఎన్ వి.శ్రీధర్ రాజ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జనవరి 22 నుంచి ఫిబ్రవరి 22 వరకు కుష్టు వ్యాధిపై సర్వే చేస్తారని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.మీనాక్షి వివరించారు. సర్వేకు వచ్చే ఆరోగ్య సిబ్బందికి అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధి నివారణపై పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఇన్‌చార్జి డీఆర్వో అప్పారావు, ఉప కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 48 ఫిర్యాదులు


ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం పరిష్కార వేదిక (ఎస్పీ గ్రీవెన్స్)లో అర్జీదారుల నుంచి 48 ఫిర్యాదులందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, టెక్కలి డీఎస్పీ మూర్తిలు ఫిర్యాదులు స్వీకరించారు. బూర్జ మండలం గుత్తావెల్లికి చెందిన సనపల సురేష్ పోలీసులు తనను రెండుసార్లు అరెస్టు చేశారని, అక్టోబర్ 16న బలగ మెట్టు కూడలిలో తన కారును అడ్డగించి దాడి చేసిన వారిని మాత్రం ఇప్పటివరకు అరెస్టు చేయలేదని, వారిని అరెస్టు చేయకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అలాగే తమ మతాన్ని కించపరుస్తూ భౌతిక దాడులకు సైతం పాల్పడుతున్నారంటూ రాష్ట్ర క్రైస్తవ ప్రగతి పరిరక్షణ చైర్మన్ కొంపట్ల జేమ్స్ ఫిర్యాదు చేశారు. లావేరు మండలం బెజ్జిపురం, వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరు, ఇచ్ఛాపురం మండలం ఇన్నేసుపేటలకు చెందిన ఇద్దరు మహిళా బాధితులు, ఇద్దరు పాస్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. క్రిస్మస్ జరపరాదని, మతాన్ని మార్చుకోవాలని, లేదంటే బహిష్కరణ తప్పదని గ్రామాల్లో తీర్మానాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రాష్ట్ర పండుగగా రథ సప్తమి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తదితరులు

- డోనర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి
- దేవాలయం ఎదురుగా ఉన్న దుకాణాలు తొలగించాలి
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



శ్రీకాకుళం పాతబస్టాండ్: అరసవల్లి రథ సప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా జరపాలని, అందుకు ప్రభుత్వం జీవో విడుదల చేయడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో రథసప్తమి వేడుకలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తితో కలిసి సోమవారం సమీక్షించారు. ముందుగా వేడుకలకు సంబంధించిన పనులపై దేవదాయశాఖ సహాయ కమిషనర్ నివేదిక సమర్పించారు.

ఇన్‌చార్జి మంత్రి చేతులమీదుగా పట్టువస్త్రాలు

స్వామివారికి పట్టు వస్త్రాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి చేతులమీదుగా అందించే దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. రథ సప్తమికి రెండు రోజుల ముందునుంచే కార్యక్రమాలు నిర్వహించాలని, మొత్తం మూడు రోజుల పండగ చేయాలని పేర్కొన్నారు. ఆలయానికి రంగులు వేయాలని, డీసీఎంఎస్ కార్యాలయం నుంచి మూడు లైన్లలో దర్శనానికి ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ప్రతీ పాస్‌పై క్యూఆర్ కోడ్ తప్పనిసరిగా ఉండాలని ఆలయ అధికారులను ఆదేశించారు. పాస్‌లు నియంత్రించాలని, దీనిలో భాగంగా డోనర్లు, రూ.500ల టిక్కెట్లు కుదించాలన్నారు. ఉచిత దర్శనానికి డీసీఎంఎస్ వైపు నుంచి, వీఐపీలకు ఆలయ ముఖ ద్వారం నుంచి ప్రవేశం కల్పించాలని సూచించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

భక్తులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, మరుగుదొడ్లు సిద్ధం చేయాలన్నారు. పారిశుద్ధ్యం, వాహనాల ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాలు పక్కాగా ఉండాలన్నారు. పార్కింగ్‌కు ముందుగా మూడు ప్రాంతాలు గుర్తించాలన్నారు. కేశ ఖండనశాల ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. కోవెల ఎదురుగా ఉన్న షాప్‌లు తొలగించాలని ఆదేశించారు. దేవాలయానికి డొనేషన్ ఇచ్చినవారు జనవరి 5వ తేదీలోగా దేవాలయం వద్దకు వచ్చి డోనర్ అర్హతను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి మాత్రమే డోనర్ కార్డు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే జిల్లాలో ఎమ్మెల్యేలకు ఒకొక్కరికీ వంద పాస్‌లు, ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్యేలకు ఒకొక్కరికీ పది పాస్‌లు వంతున అందజేయాలన్నారు.

పటిష్ట బందోబస్తు

వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను కోరారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ప్రతీ 300, 400 మీటర్లకి తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు ఉచిత ప్రసాదం అందించే దిశగా చర్యలు తీసుకోవాని సూచించారు. మీడియా పాయింట్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో అప్పారావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, జిల్లా వైద్యారోగ్య అధికారి డా.బి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

● వరి పంట.. ఇలా సాగు చేయాలంట!











వ్యవసాయ దినోత్సవం సందర్భంగా పలాస మండలం రామకృష్ణాపురంలోని సత్యసాయి పాఠశాల విద్యార్థులు ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. విత్తనాలు చల్లడం, కోతలు, మోతలు, ఎగరపోతలు, చెరగడం, ఆరబెట్టడం తదితర పనులను కళ్లకు కట్టినట్లు చేసి చూపించారు. - కాశీబుగ్గ

తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలి

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస సమన్వయకర్త రవికుమార్


గ్రీవెన్సులో వినతిపత్రం అందజేస్తున్న రవికుమార్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గత వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాల వలన వరిపంట కుప్పలు, కొన్నిచోట్ల ధాన్యం తడిచిపోవడంతో పాటు వరికోతలు పూర్తికాని పంటలు నీటమునిగాయని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస సమన్వయకర్త రవికుమార్ అన్నారు. అందువలన తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. ఈ మేరకు మీకోసం కార్యక్రమంలో వినతి పత్రం సోమవారం అందజేశారు. ధాన్యం సేకరణపై పీఏసీ అధికారులు, మిల్లర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. అలాగే పొందూరు మండలంలో సర్పంచ్‌లకు తెలియకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ అధికారాలను అధికారులు కాలరాస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతోపాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

- ప్రతులు దగ్ధం చేసిన రైతు సంఘాల నాయకులు


కాశీబుగ్గ: నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి శ్రీకాకుళం జిల్లా కమిటీ కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన్‌రావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.చంద్రరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు సవలాపురపు కృష్ణవేణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగరాపు సింహాచలం, ప్రగతిశీల దళిత వేదిక జిల్లా కార్యదర్శి బి.బాలు, రైతు సంఘం నాయకుడు పోలారావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం దేశవ్యాప్త పిలుపులో భాగంగా శ్రీకాకుళం నగరంలో అంబేడ్కర్ కూడలి వద్ద రైతు సంఘాల సమన్వయ సమితి నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన మార్కెట్ చట్టం జిరాక్స్ కాపీలను దగ్ధం చేశారు. ఇటీవల ఢిల్లీ సరిహద్దు శంబూ బోర్డర్‌లో రైతు ఉద్యమ నాయకులపై కేంద్ర ప్రభుత్వ పాశవిక దాడిని తీవ్రంగా ఖండించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఉద్యమ నాయకుడు జగజ్జీత్ సింగ్ దల్లేవాల్‌కు ఏమైనా హాని జరిగితే కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. రైతులపై జరుగుతున్న దమనకాండను ఆపాలని, అరెస్టు చేసిన రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం ఎస్‌కేఎం నాయకులకు ఇచ్చిన హామీలను అమలుపరచకుండా, రద్దు చేసిన చట్టాల్లోని విధానాలతోనే కొత్త చట్టాలు చేస్తోందని దయ్యబట్టారు. ఆ విధానాల్లో భాగంగానే డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్, నూతన సహకార చట్టం, నూతన మార్కెట్ చట్టం తీసుకొచ్చారని మండిపడ్డారు.

నిర్లక్ష్య వైఖరి విడనాడాలి

కాశీబుగ్గ: రైతులపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యపు వైఖరి విడనాడాలని రైతు సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ విధానాలపై స్థానిక రైతు కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతు వ్యతిరేక నల్లచట్టాల జీవో ప్రతులను దగ్ధం చేశారు. రైతు కార్మిక సంఘాల నాయకులు చాపర వేణుగోపాల్, నెయ్యిల గణపతి, మద్దిల రామారావు, జి.బాలకృష్ణ, ఎం.వినోద్‌కుమార్, తెప్పల అజయ్‌కుమార్, దుర్యోధన తదితరులు మాట్లాడుతూ రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేసి, మరలా ఆ చట్టాలనే అమలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రైతు అనుకూల విధానాలు అవలంభించి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు బాలాజీరావు, అప్పయ్య, రవి, గోవింద, జగన్, నాగేశ్వరరావు, పురుషోత్తం పాల్గొన్నారు.

సూర్యారావుకు అబ్దుల్‌కలాం పురస్కారం

బూర్జ: మండలంలోని ఓ.వి. పేట గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ, బీఈడీ అధ్యాపకుడు బుడుమూరు సూర్యారావుకు అబ్దుల్ కలాం గురు పురస్కారం వరించింది. డాక్టర్ చివుకుల హనుమంతరావు ట్రస్ట్ తరపున ఈ అవార్డును అందుకున్నట్లు సూర్యారావు తెలిపారు.

విద్యార్థులకు సైన్స్ పోటీలు

టెక్కలి: యురేకా సైన్స్ ఎక్స్‌పో-2025 పేరిట జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కె.కామేశ్వరరావు, అకడమిక్ కన్వీనర్ పి.ధర్మారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 10 తరగతుల విద్యార్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం-సుస్థిరాభివృద్ధి, మూఢ నమ్మకాలు-శాస్త్రీయ దృక్పథం అనే అంశాలపై వ్యక్తిగతంగా, ముగ్గురు కలిసి బృందంగా ఏర్పడి విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రయోగాలను చేసి వీడియో రూపంలో పంపించాలని సూచించారు. పూర్తి వివరాలకు 8500960840, 9394782540, 9398524988 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

జీవనాధారాన్ని ధ్వంసం చేయొద్దు

- కార్గో ఎయిర్‌పోర్టు బాధిత గ్రామాల ప్రజల వినతి

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణంతో తమ జీవనాధారం ప్రశ్నార్థకమవుతుందని మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని 20 గ్రామాలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శ్రీకాకుళం పట్టణంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. తామంతా కొబ్బరి, జీడి, మునగ, పనస వంటి పంటలపై ఆధారపడి జీవనాన్ని కొనసాగిస్తున్నామని, ఆ భూమే తమకు జీవనాధారమని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ భూముల్లోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించిన ప్రయత్నాలను మొదలుపెట్టడం సరికాదన్నారు. వెంటనే ప్రభుత్వం ప్రతిపాదనను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధిత రైతుల పక్షాన 14 మంది ప్రతినిధులు దున్న రామారావు, తెప్పల ఢిల్లీరావు, పొట్టి ధర్మారావు, కొమర వాసుదేవరావు, గుంటి లోకనాథం, పరుశురాం, మామిడి తులసయ్య, లండ రామస్వామి, లండ ఈశ్వరరావు, దిలీప్, ఈశ్వరరావు 113 సంతకాలతో ఉన్న రైతుల వినతి పత్రాన్ని జిల్లా అధికారులకు అందజేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రకాష్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సవలాపురపు కృష్ణవేణి, ప్రగతిశీల దళిత వేదిక జిల్లా కార్యదర్శి బాలు బాధితుల పక్షాన జిల్లా అధికారులకు సమస్య తీవ్రతను వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- అదుపుతప్పి ఎదురుగా ఉన్న వాహనానికి ఢీ
- మరొకరికి గాయాలు


జగదీష్ (ఫైల్)

నరసన్నపేట: మండల పరిధిలోని సత్యవరం నుంచి గొట్టిపల్లికి వెళ్లే సర్వీసు రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం ఈదులవలసకు చెందిన మెండ జగదీష్ (19) మృతి చెందాడు. అలాగే అతని స్నేహితుడు నరసన్నపేట సంతోపేటకు చెందిన సాయిరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. సర్వీసు రోడ్డులో ఎదురుగా వస్తున్న పశువైద్య సంచార వాహనాన్ని ద్విచక్ర వాహనంతో బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తలతో పాటు ఇతర శరీర భాగాలకు తీవ్రగాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే జగదీష్ మృతి చెందాడు. గాయపడిన సాయిరాజును నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

ర్యాష్ డ్రైవింగే కారణం..?

మృతుడు జగదీష్ ర్యాష్ డ్రైవింగే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఇతని తల్లిదండ్రులు విశాఖపట్నంలో ఉంటుండగా, తాను ఈదులవలసలో తమ తాత ఇంట్లో ఉంటున్నాడు. వారం క్రితం నరసన్నపేట ఎస్‌ఐ సీహెచ్ దుర్గప్రసాద్ జగదీష్‌కు రాష్ డ్రైవింగ్‌పై కౌన్సిలింగ్ ఇవ్వడం, వారం రోజులు ద్విచక్ర వాహనాన్ని పోలీసుస్టేషన్‌లో ఉంచడం జరిగింది. అయినా ఆయన ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో సోమవారం ప్రమాదానికి గురై మృతి చెందాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. సర్వీసు రోడ్డులో వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా వాహనాలను క్రమబద్ధీకరించారు. కాగా కుమారుడు మృతి వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు మెండ దాసునాయుడు, లక్ష్మిలు హుటాహుటిన నరసన్నపేటకు విశాఖ నుంచి వచ్చారు. కుమారుడు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాదంపై నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాద దృశ్యం

ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం

- ఎమ్మెల్సీ నర్తు రామారావు


పాడైపోయిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కంచిలి: అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవడం కోసం ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని బూరగాం గ్రామంలో పాడైపోయిన వరి పంటను ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాలతో పాడైపోయిన పంటను పరిశీలించమని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. రుణాలు రీషెడ్యూలు చేయడంతో పాటు, పంటల బీమా అందజేయాలన్నారు. రంగు మారిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వరిపంట నష్టపోయిన వారికి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడానికి ప్రభుత్వ ప్రోత్సాహం అందజేయాలన్నారు. అదేవిధంగా రైతులందరికీ పెట్టుబడి సాయం వెంటనే అందజేయాలని పేర్కొన్నారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు ఇప్పిలి కృష్ణారావు, కడియాల ప్రకాష్, కొనపల సురేష్, మడ్డు వెంకటరావు, వెంకటేశ్వరరావు, మస్తీల మన్మథరావు, అభియాదవ్, మద్దిలి భీమారావు తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని యువకుడు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: మండలంలోని పెద్దరోకళ్లపల్లి పంచాయతీ పరిధి బంజీరుపేట గ్రామ సమీపంలో సెల్ టవర్ వద్ద సోమవారం ఉదయం ఒక యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించడంతో టెక్కలి సీఐ విజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి పేరు, ఊరు తెలియలేదని, మృతుడి వయస్సు 35 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. అయితే ఆదివారం రాత్రి ఆ యువకుడు సెల్ టవర్‌పైన తన టీ షర్టు కట్టి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించే ఆ క్రమంలో, కిందపడిపోవడంతో తీవ్రగాయాలకు గురై మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అవినీతిపై విచారణ చేయాలని ఫిర్యాదు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పశుసంవర్ధక శాఖలో 2017లో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.11 కోట్లు దుర్వినియోగం జరిగాయని దళిత సంఘాల నాయకుడు ఇనుప రాజారావుతో పాటు మరికొందరు దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం మీకోసం కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. నిధుల దుర్వినియోగం వెనుక ఎవరెవరు ఉన్నారో సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యుల నుంచి రికవరీ చేసి దోషులను శిక్షించాలని కోరారు. దళిత రైతులకు ఎస్సీ సబ్ ప్లాన్ కింద 75 శాతం సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ చేసేందుకు కేటాయించిన నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ నిధులు వచ్చినట్లు దళిత రైతులకు సమాచారం ఇవ్వకుండా పక్కదారి పట్టించారని వివరించారు. రికార్డుల్లో సబ్సిడీ ద్వారా దాణా అందించినట్లు చూపించి క్షేత్రస్థాయిలో పంపిణీ చేయలేదన్నారు. దీనిపై జేసీ స్పందిస్తూ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల దుర్వినియోగంపై జిల్లా అగ్రికల్చర్ జేడీ, ఆర్డీవో, జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీలతో కూడిన త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అప్పుడున్న అధికారులపై సమగ్ర దర్యాప్తు చేయాలని సూచించారు.

చెట్లు నరికివేతపై ఫిర్యాదు


చెట్లు నరికివేసిన దృశ్యం

జలుమూరు: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలు పక్కపక్కనే ఉంటాయి. అయితే జూనియర్ కాలేజీ అధ్యాపక సిబ్బంది విద్యార్థులతో కలిసి బాలికల ఉన్నత పాఠశాలలో ఉన్న చెట్లు కొట్టివేయడంతోపాటు విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ కింజరాపు పద్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మండల విద్యాశాఖ అధికారులతోపాటు జలుమూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉద్దేశపూర్వకంగా జూనియర్ కాలేజీ అధ్యాపక సిబ్బంది కొంతమంది కాలేజీ విద్యార్థులతో కలిసి పాఠశాల విద్యార్థినులను అవస్థలకు గురి చేస్తున్నారని తెలిపారు. గతంలోనూ పాఠశాల ఆటస్థలంలో అనుమతులు లేకుండా ఆడడం, ఆస్తులు ధ్వంసం చేయడం, గేట్లు విరగ్గొట్టడం వంటి చర్యలకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కాలేజీ ప్రిన్సిపాల్ జామి సారిక మాట్లాడుతూ తమ కాలేజీ స్థలంలో మరుగుదొడ్ల పైపులు, టాంక్‌కు మూతవేసిన పలకలు ఉన్నత పాఠశాల సిబ్బంది కొందరు విరగ్గొట్టారని, వాటిని నిర్మించేందుకు ప్రయత్నిస్తే అడ్డుకుంటున్నారని ఆమె తెలిపారు. అలాగే తమ గేట్లుకు ఉన్నత పాఠశాల సిబ్బందే తాళాలు వేసి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు.

సద్వినియోగం చేసుకోండి

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్ల కోసం ఆర్టీసీ సంస్థ ఇచ్చిన పిలుపును అర్హులైన అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్ పిలుపునిచ్చారు. ఆన్‌కాల్ డ్రైవర్ల కోసం ఆర్టీసీ పిలుపునిచ్చిన మేరకు అర్హులైన అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులను సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పొందిన అభ్యర్థులు, ఇతర హెవీ వెహికల్ లైసెన్స్ ఉన్న అభ్యర్థులు ఈ ఆన్‌కాల్ డ్రైవింగ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ దరఖాస్తులు ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే స్వీకరించడం జరుగుతుందన్నారు. అర్హులైనవారు సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఏడీసీలు పీఆర్‌కే రావు, టీఏస్‌ఆర్ఎం రాజు తదితరులు పాల్గొన్నారు.